ఈనాడు
epaper.eenadu.net

# పాతబస్తీ మెట్రో పనులు వేగవంతమిక

## ● సీఎం చొరవతో చకచకా ముందుకు

ఈనాడు, హైదరాబాద్: పాతబస్తీలో మెట్రో రైలును త్వరితగతిన పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధంచేసింది. దాదాపు ఏడున్నర కిలోమీటర్ల నిడివి ఉన్న ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట మార్గంలో భూసేకరణ పనులు ఊపందుకున్నాయి. తొలుత గుర్తించిన 1100 ప్రభావిత ఆస్తులకు సంబంధించి మార్కింగ్ పనులను అధికారులు ముమ్మరం చేశారు. మొత్తం ఆస్తుల్లో 900 ఆస్తులకు సంబంధించి వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారని, వీటిలో 800 ఆస్తులకు ఇప్పటికే ప్రాథమిక నోటిఫికేషన్లు కలెక్టర్ జారీ చేశారని మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. నోటీస్‌పై చేసిన ఆస్తుల్లో 400 ఆస్తులకు ప్రాథమిక ప్రకటన కూడా జారీ అయిందన్నారు. వీటిలో 200 ప్రభావిత ఆస్తులకు పరిహారం నిర్ధారణను ఈ నెలాఖరులోగా ప్రకటిస్తామన్నారు. పరిహారం చెల్లించి తర్వాత కూల్చివేత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. తద్వారా పాతబస్తీలో మెట్రో నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ మార్గంలో ఉన్న వివిధ నిర్మాణాలు, ప్రభావిత ఆస్తుల యజమానులతో సానుకూలంగా చర్చించి, భూసేకరణ చట్ట ప్రకారం సేకరించి రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రార్థనా మందిరాలు, చారిత్రక కట్టడాలన్నింటినీ తప్పించి వాటిని పూర్తి స్థాయిలో పరిరక్షిస్తామని వెల్లడించారు. మెట్రోరైలు రాకతో పాత నగరం ఎంతో ఆకర్షణీయ ప్రాంతంగా మారుతుందన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగు కావడమే కాకుండా, కాలుష్య రహితంగా ఈ ప్రాంతం గొప్పగా అభివృద్ధి సాధించనుందని ఎన్వీఎస్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. మెట్రో మార్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యమిస్తున్నారన్నారు.



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొలతలు తీస్తున్న మెట్రో సిబ్బంది

Date : 16/12/2024 EditionName : GREATER HYDERABAD PageNo :